# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 209
పేజీలు : 08 | వెల: రూ.5/-

మంగళవారం
మే 20, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## ఘనంగా గోలి రవి జన్మదిన వేడుకలు

జర్నలిస్ట్, వరంగల్ వాయిస్ డెస్క్ ఇంచార్జి గోలి రవి జన్మదిన వేడుకలు హనుమకొండలోని వరంగల్ వాయిస్ దినపత్రిక కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, నెట్ వర్క్ ఇంచార్జి సామల సూర్య ప్రకాశ్, స్టాఫ్ రిపోర్టర్ సిద్దోజు రాకేష్, జంపాల మధు, గడ్డం సాహిత్ సమక్షంలో గోలి రవి కేక్ కట్ చేశారు. అనంతరం వారు రవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ

వరంగల్ వాయిస్ **ఎఫెక్ట్**



అవినీతికి కేరాఫ్ డోర్నకల్ తహసీల్

రెవెన్యూ ఆఫీస్ లో అవినీతి ఆఫీసర్

వసూళ్లకు తెగబడిన అధికారులు

లింక్ డాక్యుమెంట్ కోసం రూ. 2 వేలు డిమాండ్

ఫోన్ పే ద్వారా చెల్లించిన బాధితుడు

రెవెన్యూ శాఖ అంటేనే అవినీతి అధికారులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లక్షల్లో జీతాలు తీసుకుంటూ, సేవల కోసం లంచాలు డిమాండ్ చేస్తున్న సంఘటనలు నిత్యం మనం చూస్తూనే ఉన్నాం.. తాజాగా డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి తెగబడిన అధికారుల బండారం వెలుగు చూసింది. బాధితుడి నుంచి డబ్బుల డిమాండ్ చేసి ఓ పనికి బదులు మరో పని చేసి చేతులు కాల్చుకున్న అధికారుల తీరుతో అసలు విషయం బయటపడింది. ఈ సంఘటనతో జిల్లాలో అత్యంత అవినీతి పాలిత విభాగంగా రెవెన్యూ శాఖ మారిందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ 'ఏకే సింగ్' స్పందించాలంటూ స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

8లో..

## రికార్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్

'అవినీతికి కేరాఫ్ డోర్నకల్ తహసిల్' అనే శీర్షికతో సోమవారం వరంగల్ వాయిస్ ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన లాలు నాయక్ నూతన ఇంటి నిర్మాణానికి సంబంధించి లింక్ డాక్యుమెంట్ ఇచ్చేందుకు రికార్డ్ అసిస్టెంట్ రూ.2 వేలు డిమాండ్ చేయగా రూ.1,300 ఫోన్ ఫే ద్వారా చెల్లించిన విషయాన్ని వరంగల్ వాయిస్ వెలుగులోకి తెచ్చింది. దీంతో 24 గంటల్లో సంజాయిషి ఇవ్వాలంటూ రికార్డ్ అసిస్టెంట్ నాగరాజుకు ఎమ్మార్వో ఇమ్మానియేల్ మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు.

**– వరంగల్ వాయిస్, డోర్నకల్**



2లో..

## పెళ్లి ఇంట్లో చావు డప్పు

- వివాహం అయిన మరుసటి రోజే మృతి
- స్పృహ కోల్పోయిన నవ వధువు



8లో..

## పెరుగుతున్న భక్తులు..

- 6వ రోజుకు చేరిన సరస్వతి పుష్కరాలు
- క్షేత్ర స్థాయిలో కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణ
- అప్పటికప్పుడే వాకి టాకీ ద్వారా ఆదేశాలు

# కాళేశ్వరం కమిషన్ దూకుడు



వివరాలు 2లో..



- విచారణలో మరింత వేగం
- కేసీఆర్, హరీశ్, ఈటలకు నోటీసులు
- జూన్ 5న విచారణకు రావాలంటూ కేసీఆర్‌కు పిలుపు
- 6న హరీష్ రావు, 9న ఈటల హాజరుకు నోటీసులు

నాటి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ దూకుడు పెంచింది. కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం జూలై నెలాఖరు వరకు పొడిగించడంతో విచారణలో మరింత వేగం పుంజుకొంది. ఇంతకాలం అధికారులను మాత్రమే విచారించిన కమిషన్.. ఇప్పుడు ఇందులో కీలకంగా వ్యవహరించిన నేతలను కూడా విచారించేందుకు సిద్ధపడింది. ఈ క్రమంలో భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కూ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో జూన్ 5న కేసీఆర్, జూన్ 6న హరీశ్‌రావు, జూన్ 9న ఈటల రాజేందర్ విచారణకు హాజరుకావాలని పేర్కొంది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక శాఖ మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం విదితమే..

- వరంగల్ వాయిస్, వరంగల్

# కాళేశ్వరం కమిషన్.. దూకుడు





- విచారణలో మరింత వేగం
- కేసీఆర్, హరీశ్, ఈటలలకు నోటీసులు
- జూన్ 5న విచారణకు రావాలంటూ కేసీఆర్ కు పిలుపు
- 6న హరీష్ రావు, 9న ఈటల హాజరుకు నోటీసులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలను నిగ్గుతేల్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో మార్చి 2024లో కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్ వివరాలను నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను బాధ్యులుగా చేసి విచారించారు. అయితే విచారణలో సీనియర్ ఇంజినీర్లు, అధికారులు ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారమే నిర్ణయాలు జరిగాయని, వాటిని అమలు చేశామని చెప్పడంతో వీటిపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటల రాజేందర్ అభిప్రాయాలను కూడా తెలుసుకునేందుకు కమిషన్ సిద్ధపడింది.

## ముగ్గురికి నోటీసులు..

ఈ ప్రాజెక్టులో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయకుండా నివేదిక ఇస్తే బీఆర్ఎస్ తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని భావించిన కమిషన్ కేసీఆర్‌ను స్వయంగా విచారించాలని నిర్ణయించింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ తోపాటు హరీశ్ రావు, ఈటలకు కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని పేర్కొంది. అయితే ఇప్పటి వరకు జస్టిస్ పీసీ ఘోష్ నేపథ్యంలో చేపట్టిన విచారణలో.. సీనియర్ ఇంజినీర్లు, అధికారుల్లో ఎక్కువమంది కేసీఆర్ సమక్షంలో నిర్ణయాలు జరిగాయని, ఆయన ఆదేశాలనే అమలు చేశామని చెప్పిన నేపథ్యంలో.. వీటిపై కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని కమిషన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ పేర్కొంది.



## 7 సార్లు పొడిగింపు..

కమిషన్ నియమించిన ఆరు నెలల్లోనే నివేదిక సమర్పించాల్సి ఉన్నప్పటికీ అవసరానికి తగ్గట్లుగా ప్రభుత్వం ఏడు సార్లు కమిషన్ గడువును పొడిగించింది. గత నెలాఖరులో ఒక నెల మాత్రమే గడువు పొడిగించింది. దీని ప్రకారం మే నెల 31న కమిషన్ గడువు పూర్తికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో 21 లేదా 22 వ తేదీల్లో జస్టిస్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారన్న ప్రచారం సాగింది. అయితే అనివార్యంగా కమిషన్ గడువును మరో రెండు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మే 31న ముగియాల్సిన గడువును జూలై 31 వరకు పొడిగించారు.

## తుది దశకు నివేదిక..

కాళేశ్వరం కమిషన్ విచారణ దాదాపు తుది దశకు చేరుకుంది. కమిషన్ విచారణలో భాగంగా బ్యారేజీ నిర్మాణంలో పనిచేసిన ఏఈలు, డీఈలు, ఎస్ఈలతో పాటు– రాష్ట్ర స్థాయి అధికారులందరినీ కమిషన్ విచారించింది. వారి నుంచి అఫిడవిట్ల రూపంలో వాంగ్మూలాన్ని స్వీకరించి.. వాటిని క్రాస్ ఎగ్జామిన్ చేయడంతో పాటు బహిరంగంగా విచారించింది. ప్రాజెక్టులను నిర్మించిన కంపెనీల ప్రతినిధులను కూడా విచారించింది. అలాగే ప్రాజెక్ట్ డిజైన్లు చేసిన కంపెనీల ప్రతినిధులను కూడా కమిషన్ విచారించింది. ఏడాది పాటు సుదీర్ఘంగా జరిపిన ఈ విచారణలో దాదాపు అందరూ కూడా కేసీఆర్ పేరే చెప్పినట్లు తెలుస్తోంది. బ్యారేజీకి సంబంధించిన స్థలాల ఎంపికను ఎవరు చేశారని ప్రశ్నించగా.. ప్రధానంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరునే ప్రస్తావించినట్లు సమాచారం. స్థలాల ఎంపిక, బ్యారేజీలకు సంబంధించి కీలక నిర్ణయాలు, చెల్లింపుల నిర్ణయాల్లో కూడా ఆనాటి సీఎం కేసీఆర్, అప్పటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ ప్రమేయంతో జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వచ్చినట్లు సమాచారం. ఇప్పటి వరకు వచ్చిన వివరాలతో ఓ నివేదికను కూడా సిద్ధం చేసింది.



# లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

- కళాజాత బృందాలచే అవగాహన కల్పించాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ వాయిస్, వరంగల్ :** లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం నేరమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. ఈ మేరకు కమిటీ సభ్యులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ స్కానింగ్ సెంటర్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, జిల్లా వైద్యాధికారి సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గర్భస్థ పిండలింగ నిర్ధారణ చేయు స్కానింగ్ సెంటర్లపై దృష్టి సారించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా భ్రూణ హత్యలు జరగకుండా ప్రజలలో అవగాహన కల్పించుటకు జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో కళాజాత బృందాలచే అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో కొన్ని మండలాల్లో లింగ నిర్ధారణ చేయడంతో బాలికల నిష్పత్తిలో వ్యత్యాసం ఏర్పడుతోందని, ఇట్టి వ్యత్యాసం భవిష్యత్ తరాలకు సమస్యగా మారుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కోర్టు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కోట్ల రాధాదేవి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారిపైన కఠిన చర్యలతో పాటు వారిని శిక్షించడానికి కోర్టులు సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మామునూరు ఏసీపీ తిరుపతి, నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆచార్య, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సర్కిల్ఇన్స్పెక్టర్ వెంకన్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెళ్లి ఇంట్లో చావు డప్పు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** కోటి ఆశలతో భర్త చేయి పట్టుకొని మెట్టినింటికి చేరిన నవ వధువును విధి ఎక్కిరించింది. గ్రాండ్ గా రిసెప్షన్ జరిపేందుకు అంతా సిద్ధమవుతుండగా విద్యుదాఘాతం ఆ ఇంట విషాదాన్ని నింపింది. ఆనందోత్సవాలతో బంధు మిత్రుల నడుమ రిసెప్షన్ జరగవలసిన ఇంట్లో చావు డప్పులు మోగాయి. బంధు మిత్రుల రోదనలతో ఆ ఇళ్లు మారుమోగింది. ఈ విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గౌరారం శివారు కోడి పుంజుల తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన ఇస్లావత్ నరేష్ (25) కు కృష్ణా జిల్లా కంకిపాడు ప్రాంతానికి చెందిన యువతితో ఈ నెల 18 న ఘనంగా వివాహం జరిగింది. మంగళవారం సాయంత్రం రిసెప్షన్ జరగాల్సి ఉంది. అందరూ ఎవరికి కేటాయించిన పనుల్లో వాళ్లు నిమగ్నమయ్యారు. ఇంట్లో నల్లా నీళ్లు పట్టేందుకు నవ వరుడు నరేష్ విద్యుత్తు మోటర్ ఆన్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడే కుప్పకూలి పోయాడు. దీనికి గమనించిన బంధుమిత్రులు హుటా హుటిన హాస్పిటల్ తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. దీంతో ఒక్క సారిగా ఆ ఇంటిలో బంధు మిత్రుల రోధనలు మిన్నంటాయి. నవ వరుడి మృతితో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. దీనిని చూసి నవ వధువు స్పృహ తప్పి పడిపోయారు. అమెను హాస్పిటల్ కు తరలించి చికిత్సను అందిస్తున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదుతో బయ్యారం ఎస్సై తిరుపతి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# కంటి ముందు ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఇందులో భాగంగా డోర్నకల్ మండలం పరిషత్ కార్యాలయం ఆవరణంలో రూ.5లక్షలతో నమూనా ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. దీన్ని ప్రజల సందర్శనార్థం నిర్మించామని ఎంపీడీవో శ్రీనివాస్ నాయక్ తెలిపారు. – వరంగల్ వాయిస్, డోర్నకల్

# ఉగ్రవాదుల చర్యలను పసిగట్టడంలో కేంద్రం విఫలం

- మతోన్మాద విధానాలతో లౌకికత్వానికి ప్రమాదం
- ఎంసీపీఐ(యూ) నేత మద్దికాయల అశోక్ ఓంకార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశంలో ఉగ్రవాదుల పన్నాగాలను పసిగట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని, ఈ క్రమంలోనే పహల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల పైశాచిక దాడి జరిగిందని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ (ఐక్య)- ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం కామ్రేడ్ షేక్ నజీర్ అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కామ్రేడ్ మద్ది కాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు కర్షకులు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆదాని, అంబానీ లాంటి పెట్టుబడుదారులు యధేచ్ఛగా దేశ సంపదను అనుభవిస్తున్నారని, శ్రమజీవులకు ఎలాంటి కనీస సౌకర్యాలు తగిన విధంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి దేశ లౌకికత్వాన్ని సమగ్రతను దెబ్బతీసేందుకు మతపరమైన విధానాలకు చర్యలు చేపట్టడం ఆందోళన కలిగిస్తున్నదని, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక తరగతులకు తీరని నష్టం జరుగుతున్నదన్నారు. అలాగే దేశాన్ని రక్షించాల్సిన కీలక బాధ్యతను నిర్వర్తించాల్సిన పాలకులు అది విస్మరించి తగిన విధంగా భద్రతను ఏర్పాటు చేయకుండా, నియామకాలు చేపట్టకుండా, ఉగ్రవాదులు పర్యాటకుల ప్రాణాలు బలి కొనడానికి కారణమయ్యారని ఆరోపించారు. ఏ లక్ష్యం లేకుండానే పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించి ఎంతో సాధించామని ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. ఏ రకమైన మతోన్మాదం అయినా ప్రజలకు తీవ్రమైన హాని కలిగిస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష, సామాజిక ప్రజా సంఘాలు రాజకీయాలకతీతంగా ప్రజలను సమీకరించి ఉద్యమాలను చేపట్టేందుకు శ్రీకారం చుట్టాలని, అందులో ఎంసీపీఐ(యూ) కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముందు ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, వసుకుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, ఎన్ రెడ్డి హంసారెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

**కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, నడికూడ :** ఇనగాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడికూడ మండలంలోని కౌకొండ గ్రామంలో కౌకొండ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ముఖ్య అతిథిగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొని ప్రారంబించారు. క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో మొదటి బహుమతి రూ. 20,016/-, రెండవ బహుమతి రూ. 10,016 నగదు బహుమతిని ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు క్రీడల్లో వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై మక్కువతో ఉండాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా మళ్లీ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా లక్కం శ్రీధర్





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హన్మకొండ ఏనుగులగడ్డలో జరిగిన ప్రైవేట్ బస్సు అసోసియేషన్ ఎన్నికలు జరుగుగా అధ్యక్షుడిగా లక్కం శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల అనిల్ గౌడ్ ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులకు పన్ను మినహాయింపు కోసం కృషి చేస్తామని, ప్రవైట్ విద్యా సంస్థల బస్సులను శుభ కార్యాలకు వెళ్లకుండా అరికడుతామన్నారు. మంగళవారం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా చింతలపూడి క్రాంతికుమార్, కోశాధికారిగా అనిశెట్టి శ్యామ్, కమిటీ సభ్యులుగా మార్క కొటేష్, కొత్త కిరణ్ కుమార్, పట్నంశెట్టి శైలేష్ ప్రసాద్, ఎండీ ఫిరోజ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ టి.సత్యనారాయణ ఏసీపీ పర్యవేక్షణలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన(25) మంది వ్యక్తులను, మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరు పరిచారని వరంగల్ ట్రాఫిక్ సీఐ కె రామకృష్ణ తెలిపారు. వారిలో మొహమ్మద్ కలీమ్ ఖాన్, పెద్దూరి సతీష్ లకు రెండు రోజుల జైలు శిక్ష పడగా హుజురాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. మిగతా 23 మంది వ్యక్తులకు రూ.24,900 జరిమానా విధించారన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన ఒకరిని కోర్టులో హాజరు పర్చగా వారికి రూ.500 జరిమానాను విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ తెలిపారు.

# అవసరం మేరకు ఎరువులను వినియోగించాలి

**వ్యవసాయ శాస్త్రవేత్తలు రాజు, స్వాతి**



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** పంటలకు రైతులు అవసరం మేరకే రసాయనిక పురుగు మందులు ఎరువులను వినియోగించాలని వరంగల్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాజు, డాక్టర్ కె. స్వాతిలు అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలంలోని హౌజ్ బుజూర్గ్ గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం, పంట పెట్టబడి పెట్టుబడిని చాలా వరకు తగ్గించుకోవాలన్నారు. మోతాదుకు మించిన రసాయనిక పురుగు మందులు, ఎరువులను వాడకూడదన్నారు. పంట మార్పిడి చేపట్టాలన్నారు. . రైతులు కొనుగోలు చేసిన ఎరువులు పురుగు మందుల రశీదులను భద్రపరచుకోవాలన్నారు. గ్రామంలో పోషక విలువలను, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో యాదగిరి, ఏఈఓ ప్రవళిక, వరంగల్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లాలోని ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని ఆర్డీఓ కార్యాలయంలోమంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ భూ భారతి – రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక ఉప కలెక్టర్లు, నియోజకవర్గ మండలాల తహసీల్దార్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతి మాడ్యూల్ లో వచ్చిన వివిధ భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, మిస్సింగ్ నంబర్, భూ సేకరణ, కోర్టు కేసులు, డిజిటల్ సంతకం వంటి మాడ్యూల్ లలోని సమస్యల పరిష్కారం దిశగా క్షుణ్ణంగా చర్చించారు. అదే విధంగా ఈ భూ సమస్యల దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించి, ఆయా భూ సమస్యల పరిష్కారంలో వేగం పెంచి, త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో, అలాగే ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి కలిపి ఇప్పటివరకు మొత్తం (1900) దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గ మండలాల తహసీల్దార్ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమరుడు చందు కుటుంబానికి ఆర్థిక సహాయం



**వరంగల్ వాయిస్, కన్నాయి గూడెం :** మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన సాధన పల్లి రవి అలియాస్ చందును ఇటీవల కర్రెగుట్టల్లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ఎన్కౌంటర్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలకోటి మహేందర్ న్యాయవాది రవి స్వగ్రామమైన ఏటూరు కు వచ్చి కామ్రేడ్ రవి కుటుంబాన్ని పరామర్శించి, నివాళి అర్పించి , మానవతా దృక్పథంతో రూ.5000 ఆర్థికసాయం అందించారు. కామ్రేడ్ రవి తల్లి సాధనపల్లి అన్నపూర్ణకు అంబేద్కర్ చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రవి తల్లి సాధన పల్లి అన్నపూర్ణ, అన్న సాధన పల్లి రాజు, మేనత్తలు భాగ్య, రాజేశ్వరి, ములుగు జిల్లా సాధన సమితి అధ్యక్షులు ముంజాల భిక్షపతి గౌడ్, వట్టం జనార్ధన్, తుడుం దెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు, రచయిత వెంకట్ పెరమళ్ల, మండల బీఆర్ఎస్ నాయకులు సుబ్బుల సమ్మయ్య పాల్గొన్నారు.

# వైద్యులు మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని జిల్లా ప్రధాన ఆస్పత్రిని మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ బ్లాక్, యూరాలజీ బ్లాక్, జనరల్ వార్డు, పరిసరాలను, హాస్పటల్ ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్, డాక్టర్స్ సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న పేషెంట్లకు అందిస్తున్న సేవల వివరాలు సూపరెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆర్ఎంఓ డాక్టర్ జగదీష్ లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలు అందించాలని, హాస్పిటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సదరం క్యాంపుల నిర్వహణ (వైద్య పరీక్షల) కోసం ఆస్పత్రిలో అనువైన ప్రదేశంలో వారికి సేవలు అందించడానికి యూఐడీ (బ్లాక్) నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. స్పెషలైజేషన్ మానసిక, కంటి, చెవి, ముక్కు, దంతాల, విభాగం తదితర వినికిడి లోపం ఉన్న వారిని పరీక్షల కోసం తగిన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా స్వచ్ఛమైన పదార్థాలను అందించాలన్నారు. ఆస్పత్రిలో పార్కింగ్, వైద్య విభాగాలు, సానిటేషన్ నిర్వహణ తదితరాంశాలపై కలెక్టర్ తగు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డీఈ, ఏఈ, శంకర్, సంబంధిత విభాగాల సిబ్బంది ఉన్నారు.

## చెస్ వేసవి శిక్షణ శిబిరం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ రెడ్డీకాలనీ రోడ్ నంబర్–3లో బీటీఎస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు వారాల వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పిల్లలను సెల్ ఫోన్లు, టీవీకి దూరంగా ఉంచడంతో పాటు ఏకాగ్రత పెంచడం, క్రమశిక్షణ అలవర్చడం, సమస్య పరిష్కార మార్గాలను తెలుసుకునేందుకు తల్లిదండ్రులు చేర్పించాలని బీటీఎస్ చెస్ అకాడమీ చైర్మన్ దామెర ప్రేమ్ సాగర్ తెలిపారు. నేషనల్ సీనియర్ ఆర్బిటర్, రేటెడ్ టోర్నమెంట్ లకు అవసరమైన మెలకువలు నేర్పనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81429 21934 సెల్ నంబర్ కు సంప్రదించాలని కోరారు.

## ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆల్ ఇన్ వన్ ది వరంగల్ డిస్ట్రిక్ట్ ఎన్టీఆర్ యువసేన ఆధ్వర్యంలో వరంగల్ లోని వెంకటరమణ థియేటర్ లో మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ స్టేట్ కన్వీనర్ పంజా రాంబాబు ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వెంకటరమణ థియేటర్ యజమాని శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల శివ, జిల్లా కమిటీ సభ్యులు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు వృత్యంతర శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల స్థాయిలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు నిర్వహించే వృత్యాంతర శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రఘునందన్ రెడ్డి సూచించారు. మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు వెల్ది మోడల్ స్కూల్ లో నిర్వహించిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారను. ప్రాథమిక పాఠశాల స్థాయిలో బోధించే ఉపాధ్యాయులు నిరంతర పాఠ్యంశాలపై పట్టు సాధించినప్పుడే విద్యార్థులకు సులభమైన పద్ధతిలో విద్యార్థులను సంసిద్ధులను చేయవచ్చన్నారు. అందుకు అనుగుణంగానే ఈ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి మండల ఆర్పిలుగా వెంకటేశ్వర్ రావు, సురేష్, సంతోష్ రెడ్డి, రాజు, వ్యవహరించారు. ఉపాధ్యాయులతో పాటు ఎంఆర్సీ సిబ్బంది సమ్మయ్య, మల్లిఖార్జున్, రమేష్, కనకయ్య, జ్యోతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్రం విడనాడాలి

**◆ కలెక్టరేట్ ఎదుట కార్మికుల నిరసన**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ, ఐఎన్టీయూసీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. లేబర్ కోడులను రద్దు చేయాలని, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలి, కార్మిక సంఘాల ఐక్యత వర్ధిల్లాలి, ధరలను నియంత్రించాలంటూ పెద్ద ఎత్తున దారి పొడవునా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు టి.ఉప్పలయ్య అధ్యక్షతన సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేశారని విమర్శించారు. కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును ప్రశ్నార్థకం చేస్తూ కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చారని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల 8 పనిగంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి యాజమాన్యాలు యథేచ్ఛగా మరింత శ్రమ దోపిడీ చేసే విధంగా అవకాశం కల్పించి కార్మికులను మోసం చేసిందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయ్ మెంట్ విధానం తీసుకువచ్చి కార్మిక హక్కులను కాలరాశారని మండిపడ్డారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై జూలై 9న జరిగే దేశవ్యాపిత సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. రైతులకు మద్దతు ధర కల్పించి స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని పనికి ఆహార పథకాన్ని 200 రోజుల కు పెంచి 600 రూపాయల కూలిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బోట్ల చక్రపాణి, బి.మహేష్, ఎన్.రజిత, బి.సంపత్, ఏ.యాకయ్య, మంద మల్లేశం, డి.భాను నాయక్, ఐఎన్టీయూసీ ఆశా యూనియన్ నాయకులు మైముదా, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దోగ్గేల తిరుపతి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి సాంబయ్య, కె.కుమారస్వామి, వై.బాబు, యాకూబీ, కల్పన, జే.శ్వేత, లీల తదితరులు పాల్గొన్నారు.

# గుండేటిని పరామర్శించిన పద్మశాలి జిల్లా ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పట్టణ పద్మశాలి సంఘ గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీష్ ఆధ్వర్యంలో పద్మశాలి నేతలు కార్పొరేటర్ నరేందర్ ను వారి స్వగృహంలో మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుసుమ సతీష్ మాట్లాడుతూ ప్రస్తుత 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ మీద సొంత పార్టీకి చెందిన నేతలే అంతర్గత విభేదాలతో, కక్షపూరితంగా కుట్రపన్నీ, బూటకపు కేసు పెట్టించి, అరెస్ట్ చేయించడం అమానుషమన్నారు. అలాగే ఒక కార్పొరేటరే ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటే సాధారణ పౌరులు వరంగల్ తూర్పులో ఈ గుండారాజ్ ప్రభుత్వాన్ని ఎలా ఎదుర్కోని, మనుగడ సాగించగలరని అన్నారు. ఇలాంటి సంఘటనల తో వరంగల్ తూర్పులోని సామాన్యులు, వ్యాపారవేత్తలు ఈ అధికార గుండారాజ్ ప్రభుత్వానికి బెంబేలెత్తిపోతున్నారు. కాపాడాల్సిన చట్టం అధికార పార్టీకి చుట్టానిగా మారి, అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారిన ఈ తీరుపై, కాంగ్రెస్ కి ఓటేసి గెలిపించుకున్న తూర్పు ప్రజలు నివ్వరపోయి బాహాటంగానే చర్చించుకుంటున్నారన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీఎస్ మూర్తి మాట్లాడుతూ ఒక ప్రజాప్రతినిధిగా, పట్టణ పద్మశాలి సంఘ గౌరవ అధ్యక్షుడిగా గత 20 సంవత్సరాలుగా ప్రజాసేవకి అంకితమైనటువంటి ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగినటువంటి పద్మశాలి బిడ్డపై ఇలాంటి కక్షసాధింపు కేసులు పెట్టి, అరెస్ట్ చేయించడాన్నితీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి బూటకపు కేసులపై పద్మశాలి సమాజం మొత్తం నరేందర్ వెంట ఉండి పోరాడుతుందని తెలిపారు. కార్పొరేటర్ ని పరామర్శించిన వారిలో అఖిల భారత పద్మశాలి సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, జిల్లా ప్రతినిధులు బైరి.మురళీకృష్ణ, బైరి శ్యామ్ సుందర్, కూచన క్రాంతి కుమార్, మాచర్ల దీన్ దయాల్, కనుకుంట్ల రంజిత్, బేతి అశోక్, డాక్టర్ పరికిపండ్ల అశోక్, రాజ గోవింద్, కారంపూడి ఉమేష్, కోమాకుల నాగరాజు, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కోట సతీశ్, కుడికాల మహాదేవ్, గుర్రపు సత్యనారాయణ, అల్లి అజయ్, కొంతం సంగీత్, కందగట్ల మల్లికార్జున్, బొడ్డు రాకేష్, వంగ సంపత్, చిమ్మని శ్రీకాంత్, వివిధ బీసీ సంఘాలు, ఇంటలెక్చువల్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో ప్రజల హక్కుల హననం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ పాలనలో ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారని హనుమకొండ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సీపీఐ జిల్లా కేంద్ర శాఖ మహాసభకు రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ అధ్యక్షత వహించగా కర్రె భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ ను పరుస్తూ లక్షల కోట్ల రూపాయలను రాయితీలు ఇస్తూ ప్రజల సంక్షేమం మరిచి ప్రజాస్వామ్య గొంతును, ప్రజల గొంతుకను అణిచివేస్తూ కేంద్రం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతున్నదన్నారు. రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్య మంటగలుపుతున్నారని, కేంద్రంలో జాతీయవాదం పేరుతో హిందుత్వ ఏజెండాతో ముస్లిం, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులపై విషం కక్కుతూ ప్రశ్నించే గొంతుకను నొక్కుతున్నారని మండిపడ్డారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందక ప్రజలు ఆందోళనకు గురవుతున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని ఆయన అన్నారు. సమావేశంలో డాక్టర్ శంకర్ నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తున్నదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఫాసిస్ట్ చర్యలను మేధావులు, విద్యార్థులు ఐక్యంగా వ్యతిరేకించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, టి.సుధాకర్, దండు మోహన్, ఎండీ ఉస్మాన్ పాషా, తాండూరి గోపి, ఎర్ర నాగరాజు, గిన్నారపు రోహిత్, పి. కిషోర్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్ర శాఖ కార్యదర్శిగా టి.సుధాకర్, సహాయ కార్యదర్శిగా ఎండీ ఉస్మాన్ పాషా, మరో ఐదుగురితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# టీజేఎఫ్ రజతోత్సవ సంబరాలను విజయవంతం చేద్దాం

➔ ఓరుగల్లు జర్నలిస్టుల ఐక్యతను చాటుదాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆవిర్భవించి మే 31తో 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్ లో నిర్వహిస్తున్న సంబరాలను విజయవంతం చేద్దామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (హెచ్-143) హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31న టీజేఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తుందని తెలిపారు. 2001 మే 31న ఆవిర్భవించిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఇంతటి చారిత్రక నేపథ్యం కలిగిన జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబరాలకు హనుమకొండ జిల్లా నుంచి అధిక సంఖ్యలో తరలివెళదామని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదం పుట్టిన ఓరుగల్లు చైతన్యాన్ని మరోసారి చూపించాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. టీజేఎఫ్ రజతోత్సవ సంబరాల గోడపత్రికలను హనుమకొండ అమరవీరుల కీర్తి స్తూపం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బీఆర్ లెనిన్, నాయకులు పిన్నింటి గోపాల్, పొగాకుల అశోక్, దొంతు నవీన్, పబ్బు సతీష్, ఆరెల్లి కిరణ్, తాళ్లపల్లి వెంకన్న, గొల్లపల్లి వెంకటరత్నం, యూనియన్ కోశాధికారి పొగాకుల ప్రభాకర్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు బూరం ప్రశాంత్, తాళ్లపల్లి వేణుగోపాల్, ఫొటో జర్నలిస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సంపేట సుధాకర్, గొట్టే వెంకన్న, వీడియో జర్నలిస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కునమల్ల రామచందర్, చుంచు రామరాజ్, ప్రెస్ క్లబ్ కమిటీ బాధ్యులు గోకారపు శ్యాం కుమార్, బొడిగే శ్రీనివాస్, అల్లం రాజేష్ వర్మ, వీరగోని హరీష్, దొమ్మాటి శ్రీకాంత్, యూనియన్ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు వంశీ, సిరిమల్లె సదానందం, సత్యనారాయణ, రాజేందర్, కర్నాకర్, శ్రీకాంత్, సాల్మాన్, రంజిత్, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సాగుతున్నాం

◆ ప్రజలు అభివృద్ధికి సహకరించాలి
◆ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వచ్చే ఎన్నికల నాటికి ప్రతి కాలనీలో చుక్క నీరు నిల్వకుండా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నియోజవర్గ పరిధిలోని 58వ డివిజన్, 61 వ డివిజన్ వడ్డేపల్లి, ప్రశాంత్ నగర్, సిద్ధార్థ నగర్, వెంకటాద్రి నగర్ లలో దాదాపు రూ.3 కోట్లతో ఆయా కాలనీలలో అంతర్గత రోడ్లు నిర్మాణం, సైడ్ డ్రైన్ల నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాయిని పాల్గొని కొబ్బరికాయ కొట్టారు. స్థానిక ప్రజల అవసరాల దృష్ట్యా సమవుజ్జీగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. వర్షాకాలంలో సమీపిస్తున్న క్రమంలో నిర్ణీత సమయంలో రోడ్లు,డ్రైన్ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అభివృద్ధి కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తే ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నాయి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం సమవుజ్జీగా చేస్తున్నామని తెలిపారు. గడిచిన పదేళ్లలో చాలా కాలనీలలో డ్రైన్, సీసీ రోడ్ల అవసరం ఉన్నదని క్రమేపీ మున్సిపల్ నుంచి ఆర్ అండ్ బీ నుంచి నిధులను తీసుకుని వస్తూ పనులను చేయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగులో యూరియా తగ్గించండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** పంటలలో యూరియాను అధిక మోతాదులో వాడటం వల్ల నేల యొక్క ఆమ్ల తత్వం పెరిగి నేలలోని సూక్ష్మజీవులు నశించడమే కాకుండా ఇతర పోషకాలను పంట తీసుకోకుండా చేసి దిగుబడులను తగ్గిస్తుందని, యూరియాను సిఫారసు మేరకే ఇతర పోషకాలతో కలిపి వేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. మంగళవారం మండలంలోని వరికోల్ గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ హరికృష్ణ, గోపికల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట మార్పిడి విధానం, చెట్ల పెంపకం, రశీదులను భద్రపరచడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట మార్పిడి విధానం ద్వారా నేల సారాన్ని సహజ సిద్ధంగా పెంచేందుకు పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు వేసుకోవాలని, నీటిని తక్కువగా వినియోగించుకునే చిరు ధాన్య పంటలను వరి తర్వాత యాసంగిలో వేసుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. నీటిని ఆదా చేయడానికి బిందు సేద్యం, మల్చింగ్ వంటి పద్ధతులను అనుసరించాలన్నారు. వరి సాగు చేసే నేలల్లో నీరు ఇంకే గుణం కోల్పోయి భూగర్భ జల మట్టం తగ్గిపోతుందని, ఎకరం వరి సాగు చేసే నీళ్లతో మూడు ఎకరాల జొన్న, మొక్కజొన్న, వేరుశనగ పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. విపత్కర సమయాల్లో నష్టం వాటిల్లితే ప్రభుత్వాలు ఇచ్చే బీమా సాయం పొందడానికి రశీదులను భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ మాట్లాడుతూ తొలకరి వర్షాలకు జీలుగ, పెసర్లు వరి నాట్లకు ముందు వేసుకొని భూమిలో 45 రోజుల తర్వాత కలియ దున్నడం వలన నెలలోనీ కర్బన శాతం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. వ్యవసాయ విద్యార్థులు రజిత, రఘు, వంశీ అధిక సాంద్రత పత్తి సాగు పైన రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ అధికారి మాధారపు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## షార్ట్ ఫిలిం ఆవిష్కరణను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధరలు పలకక నాణ్యమైన విత్తనాలు దొరకక అనేకమైన రకాలుగా రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. మంగళవారం వరంగల్ అబ్బని కుంటలో తెలంగాణ రైతు సంఘం భవనంలో ఈ నెల 21న రైతులను చైతన్యపరిచే విషయాలపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్మించబడిన రైతుల హక్కులను ఐక్యంగా సాధించుకునే విధంగా షార్ట్ ఫిలిం తీసిన కార్యక్రమాన్ని సీడీ రూపంలో రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ హాజరై సీడీ ఆవిష్కరిస్తారని తెలంగాణ ఉద్యమకారుల జిల్లా నాయకులు సోమ రామ్మూర్తి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు ఐతం నగేష్, ఊరటి అంశాలరెడ్డి, ఉపాధ్యక్షులు సిర్ల రవీందర్, కోశాధికారి కమిటీ సభ్యులు సోమిడి సాంబయ్య, బోల్లు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హెడ్మాస్టర్లకు వృత్యంతర శిక్షణ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్లకు ఐదు రోజుల పాటు వృత్యంతర శిక్షణ నిమిత్తం దామెరలోని ఏకశిలా ప్రైమ్ స్కూల్లో శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారి లకావత్ రాజేష్ కుమార్ ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొండల్ రెడ్డి, మండల రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఐదు రోజులు 20 నుంచి 25 వరకు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో వృత్తిపరమైన నైపుణ్యాలపై ప్రస్తుతం విద్యా వ్యవస్థలో జరుగుతున్న మార్పులపై మండల రిసోర్స్ పర్సన్లు సేషన్ వారీగా తరగతులు నిర్వహించారు.

## నవచేతన బుక్ హౌస్ లో పుస్తక ప్రదర్శన ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక అశోక కాంప్లెక్స్ లోని నవచేతన బుక్ హౌస్ లో మంగళవారం పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. వేసవి సెలవుల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పిల్లల పుస్తక ప్రదర్శనను నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుందని, ప్రతి ఒక్కరూ పుస్తకాలను నిరంతరం కొనసాగించాలని అన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాల పబ్లిషర్స్, రచయితలు, కవుల పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందని, అన్ని రకాల పుస్తకాలపై 10 శాతం నుంచి 30 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యాసంస్థలు, మేధావులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, దండు మోహన్, ఎండీ ఉస్మాన్ పాషా, తాండూరి గోపి, పి.కిషోర్ కుమార్, సిబ్బంది రమేష్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## పీపీయూనిట్ లో డీఎంహెచ్ఓ అకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక ఎంజీఎం హాస్పిటల్ ఆర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీపీ యూనిట్)ను మంగళవారం వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్.బి.సాంబశివరావు అకస్మికంగా తనిఖీ చేశారు. పీ.పీ యూనిట్ వెల్ బేబీలో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు నిల్వ చేసే కోల్డ్ చైన్ సిస్టంను పరిశీలించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా పట్టణంలో పర్యటించినప్పుడు పరిసర ప్రాంతాలను పరిశీలించాలని, వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలి, జ్వరాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని అన్నారు. డాక్టర్.మోహన్ సింగ్, ఎంజీఎం పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఎం.యశస్విని, హెచ్.ఈ.ఓ. విద్యాసాగర్, సూపర్ వైజర్ నర్మద, ఈవిన్ మేనేజర్ రవీందర్, నర్సింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, రామ రాజేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల పరిశీలన

## కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** హనుమకొండ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.విద్యాలత మంగళవారం ఆత్మకూరు, తిరుమలగిరి గ్రామపంచాయతీలను సందర్శించారు. దీనిలో భాగంగా తిరుమలగిరి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. వీలైనంత వరకు ఉదయాన్నే పని ప్రదేశానికి వచ్చి రూ.307 ప్రతి రోజు వచ్చే విధంగా కొలతల ప్రకారం పని ముగించుకుని ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే ఇళ్లకు వెళ్లాలని తెలిపారు. పని ప్రదేశంలో కూలీల కోసం ఏర్పాటు చేసిన నీడ, మంచినీరు చూసి సిబ్బందిని అభినందించి అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తదుపరి వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్), డ్రైనేజ్ ఎండ్ లో నిర్మించిన కమ్యూనిటీ ఇంకుడు గుంత, నర్సరీ చూసి సంతృప్తి వ్యక్తం చేయడం జరిగింది. తదనంతరం ఆత్మకూరు గ్రామపంచాయతీలో గల సెగ్రిగేషన్ షెడ్ దగ్గర దాదాపు 2000 గజాలలో ఏర్పాటు చేయబోయే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఈసీ రాము, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, అనూష, సిబ్బంది రాజేశ్వరరావు, రాంబాబు, నరేష్ పాల్గొన్నారు.

# రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు



**వరంగల్ వాయిస్, రేగొండ :** ఖరీఫ్ సీజన్‌కు గాను పచ్చిరొట్ట విత్తనాలు రాయితీపై అందిస్తున్నట్లు ఏవో సారయ్య తెలిపారు. నూతన కొత్తపల్లి గోరి మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు అయినా జీలుగ 30 క్వింటాళ్లు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని మంగళవారం మండల వ్యవసాయ అధికారి జి.సారయ్య పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా క్వింటాల్ కు పూర్తి ధర రూ.14250 కాగా, 50 శాతం రాయితీపై రూ.7125 ధరకు రైతులకు అందించడం జరుగుతుందన్నారు. 30 కిలోల బస్తా ధర 2137.50, కావున జీలుగ కావలసిన కొత్తపల్లిగోరి మండల రైతు సోదరులు పట్టా పాస్ పుస్తకం కాపీతో మండలవ్యవసాధికారి కార్యాలయం, కొత్తపల్లి గోరి సంప్రదించి పొందవచ్చని తెలిపారు.

# నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందున వరంగల్ చౌరస్తాలో గుమాస్తాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు, భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు నేడు ముప్పు వాటిల్లిందని కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడులను అమలుకు తెస్తున్నారు. 12 గంటల పనిని చట్టబద్ధం చేస్తున్నారని, సామాజిక భద్రత పథకాలకు నిధులు తగ్గిస్తున్నది, కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్ ను కఠినతరం చేసి కార్మిక సంఘాలను రద్దు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం బరితెగించిందని మండిపడ్డారు. జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బావు రామస్వామి, వెంకటేశ్వర్లు, జి.ఉమా, సరిత, అనూష, కవిత, దేవి, సంతోష్, కుమారస్వామి, నిఖిల్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ ప్రక్రియ అనివార్యం

**➲ డా. వకుళాభరణం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ శాసనసభలో 42శాతం బీసీ రిజర్వేషన్లపై రెండు బిల్లులను ఏకగ్రీవంగా ఆమోదించినప్పటికీ, అవి ఆర్టికల్ 31–సి ప్రకారం మాత్రమే రాష్ట్రపతికి పంపబడ్డాయి. అయితే ఆర్టికల్ 31–బిలోని 9వ షెడ్యూల్‌లో ఈ బిల్లులను చేర్చాలని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం కోరకపోవడం చట్టపరంగా పెద్ద లోపమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై స్పందించిన డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ముఖ్యమంత్రి సహా కొంతమంది మంత్రులు మీడియా ప్రకటనల ద్వారా కేంద్రాన్ని డిమాండ్ చేయడం హాస్యాస్పదమని, అది అసంపూర్ణ అవగాహనను ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం న్యాయ నిపుణుల అభిప్రాయాన్ని తీసుకుంటుందా? అనే సందేహం ఉందని తెలిపారు. ఇది వంటి కీలకమైన రాజ్యాంగ అంశంపై స్పష్టత లేకపోవడం, బీసీల హక్కులకు నష్టం కలిగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆర్టికల్ 31–సీ ద్వారా రిజర్వేషన్లను రక్షించాలనడం తప్పు కాదు కానీ, 9వ షెడ్యూల్‌లో చేర్చే ప్రయత్నాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభించకపోవడం అసలైన లోపం అని చెప్పారు. 9వ షెడ్యూల్‌లో చేర్పు కోసం అవసరమైన ప్రక్రియను డా. వకుళాభరణం ఈ విధంగా వివరించారు. శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించాలి, ఆ తీర్మానాన్ని లేఖ రూపంలో కేంద్రానికి పంపాలి, బూసని వెంకటేశ్వర రావు కమిషన్ నివేదికలు, ఎస్ఈఈఈపీసీ సర్వే గణాంకాలు, న్యాయతర్కాలతో కూడిన సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించాలి, ఆపై పార్లమెంటు చర్చించి 9వ షెడ్యూల్ చేర్పును ఆమోదించాల్సి ఉంటుందని,మంత్రిమండలిలో తీర్మానం చేయాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయినప్పుడే రాజ్యాంగబద్ధ రక్షణ కలుగుతుందని స్పష్టంచేశారు. తమిళనాడు రాష్ట్రం 1994లో 69శాతం రిజర్వేషన్లకు ఇదే విధంగా రక్షణ పొందినదాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రస్తుతం మంత్రుల మీడియా ప్రకటనలు ప్రజలకు ఊహాలే కలిగిస్తున్నాయని, అధికారికంగా చర్యలు తీసుకోవడమే అవసరమని సూచించారు. ప్రకటనలతో కాకుండా, రాజ్యాంగబద్ధ మార్గంలోనే సమస్యకు పరిష్కారం చూపాలన్నది ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. రాష్ట్రపతిని కలవడానికి ప్రభుత్వం తక్షణమే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, అఖిలపక్ష బృందంతో కలిసి వెళ్లి —బిల్లుల అవసరం, గణాంకాలు, న్యాయపరమైన విశ్లేషణలు సమర్పించాలని డా. వకుళాభరణం సూచించారు. ఇదే సమయంలో, బూసని వెంకటేశ్వర రావు కమిషన్ నివేదికలు ఇంకా ప్రజలకు అందుబాటులో లేకపోవడం నిరాశాకరమని చెప్పారు. మార్చి 17న బిల్లులు శాసనసభలో ప్రవేశపెట్టినప్పుడు కూడా ఆ నివేదికలను సభ ముందు ఉంచకపోవడాన్ని ఖండించారు. కేంద్రానికి 9వ షెడ్యూల్‌లో చేర్చమని కోరే ముందు, ఏ ఆధారాలను చూపిస్తారు? అనే నైతిక, విధానపరమైన ప్రశ్నలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి పారదర్శక పాలనకు వ్యతిరేకంగా ఉందని, ప్రభుత్వం వెంటనే నివేదికలను బహిరంగంగా ఉంచాలని డా. వకుళాభరణం స్పష్టంగా కోరారు. “బీసీలకు న్యాయం జరగాలంటే ప్రకటనలు కాకుండా, చట్టాన్ని గౌరవించి ప్రభుత్వంగా బాధ్యతతో ముందడుగు వేయాలి. ఆలస్యం చేస్తే ఇది ఫలితం లేని ప్రక్రియగా చరిత్రలో మిగిలిపోతుంది” అని హెచ్చరించారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**వరంగల్ వాయిస్, జనగామ :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. మంగళవారం యశ్వంతాపూర్ పరిధిలో గల క్రీస్తుజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో నేటి నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న రెండో విడత జిల్లా స్థాయి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై, ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజ స్థాపనలో విద్యార్థులను ఉన్నతమైన, ఆదర్శవంతమైన విద్యార్థులుగా సిద్ధం చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగా సామర్థ్యాల పెంపునకు నిర్వహిస్తోన్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రతి ఒక్క ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని, తాము నేర్చుకుంటూ విద్యా బోధన చేసినప్పుడే విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పు సాధించవచ్చన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు నూతన విషయాలను తెలియజేస్తాయని, ప్రతి ఉపాధ్యాయుడు శిక్షణలో అందిస్తోన్న అంశాలను ఆకలింపు చేసుకొని, విద్యార్థుల్లో ఆశించిన మార్పుల సాధనే లక్ష్యంగా పని చేయాలన్నారు. వేల ఏళ్లుగా ఉన్న అసమానతలను విద్య ద్వారానే తగ్గించే అవకాశం ఉందని, విద్య ద్వారా జీవన ప్రమాణాలు మెరుగవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, ఏఎంఓ శ్రీనివాస్, ఏసీజీఈ రవి కుమార్, జీసీడీఓ గౌసియా బేగం, కోర్సు ఇంచార్జులు మల్లిఖార్జున్, యాదగిరి, ఆనంద్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లులో కాకతీయ వారసుడి సందడి

**◆ భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం కాకతీయ వంశస్థులు రాజా కమల్ చంద్ర భాంజీదేవ్ సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. ఆలయానికి విచ్చేసిన రాజా కమల్ చంద్ర భాంజీదేవ్ కు ఆలయ ఈఓ, సహాయ కమీషనర్ శేషుభారతి,





ప్రధానార్చకులు భద్రకాళి శేషు అయ్యగారు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయభాస్కర్ తదితరులున్నారు. పూజానంతరం ఆలయ స్నపన మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం పోచమ మైదానంలోని రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేశారు. తరువాత వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ తో కలిసి ఖిలా వరంగల్‌లోని శంభుని దేవాలయంలో కూడా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీలు, యువజన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రొమాంటిక్ థ్రిల్లర్ నేపథ్యంలో

## రీతూవర్మ దేవిక అండ్ డానీ వెబ్ సీరిస్

యంగ్ హీరోయిన్ మన తెలుగు అమ్మాయి రీతూ వర్మ తన అందం, అభినయంతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. స్కిన్ షో కి దూరంగా కథకు ప్రాధాన్యమున్న పాత్రలే చేస్తూ దూసుకెళ్తున్నారు రీతూ. రీసెంట్‌గా త్రినాథరావు నక్కిన దర్శకత్వంతో సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన 'మజాకా' మూవీ తో విజయం సాధించింది. ఇక ఇదే హిట్ జోష్‌లో రీతూ ప్రజంట్ 'దేవిక అండ్ డానీ' అనే రొమాంటిక్ అండ్ థ్రిలింగ్ వెబ్ సిరీస్‌తో రాబోతుంది. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ ఎంతో ఆకట్టుకోగా తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిప ట్రైలర్ విడుదల చేశారు. ఇందులో రీతు వర్మ టీచర్ రోల్ లో డిఫరెంట్‌గా ఉండబోతున్నట్లు– తెలుస్తోంది. మొదట్లో కామెడీ నడిచి ఒక్కసారిగా వైలెన్స్ మొదలైంది. కానీ ఎక్కడ కూడా స్టోరీ లీక్ అవ్వకుండా ట్రైలర్ ను బాగా కట్ చేశారు. మొత్తానికి రొమాంటిక్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కాగా ఈ చిత్రం జూన్ 6 నుంచి డిస్నీ హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ కానుంది.



## కీరవాణిని సన్మానించిన పవన్ కళ్యాణ్



మన మూలాల నుంచి పుట్టిన వ్యక్తి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం అదృష్టంగా భావిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం, అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్ అన్నారు. ఆయన కీలక పాత్రలో నటించిన హిస్టారికల్ యాక్షన్ డ్రామా 'హరి హర వీరమల్లు' క్రిష్ జాగర్లమూడి, ఏఎం జ్యోతికృష్ణ దర్శకత్వం వహించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి స్వరాలు సమకూర్చారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు కీరవాణి స్టూడియోను సందర్శించిన పవన్ కల్యాణ్ ఆయనను సన్మానించారు. తన జీవితాన్ని ప్రభావితం చేసిన అంశాలను కథలుగా మలిచి రాసిన పుస్తకాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్‌కు కీరవాణి బహుమతిగా అందించారు. 'మీరు అందుకున్న ఆస్కార్ ఎక్కడ ఉంది' అంటూ ఆప్యాయంగా పవన్ అడగటంతో కీరవాణి తన గదిలోకి వెళ్లి తీసుకొచ్చి మరీ చూపించారు. ఆ అవార్డును పవన్ కల్యాణ్ తన చేతుల మీదుగా మరోసారి కీరవాణికి అందించారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణసంస్థ విడుదల చేసింది. ఏఎం రత్నం నిర్మాతగా వ్యవహరించిన 'హరి హర వీరమల్లు' జూన్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఎల్లమ్మ కోసం వేణు అష్టకష్టాలు

ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన 'బలగం' సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో చెప్పక్కర్లేదు. చిన్న పెద్ద తేడా లేకుండా పలేటూరు నుంచి బస్సులు కట్టుకొని వచ్చి మరీ ఈ మూవీని చూశారు ప్రేక్షకులు. మొత్తానికి ఇప్పటివరకు కమెడియన్‌గా ఉన్న వేణు.. మొదటి సినిమాతోనే ఒక ప్రత్యేక స్థానం నమ్మకం సంపాదించుకున్నాడు. దీంతో వేణు దర్శకుడిగా బిజీ అవుతాడని, బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తాడని అంతా అనుకున్నారు. కానీ..ఆయన 'ఎల్లమ్మ' అనే సినిమాను చేయాలనే సంకల్పంతో గత ఏడాది కాలంగా అదే స్కిప్ట్‌త్రో హీరోల చుట్టూ తిరుగుతున్నట్లు– తెలుస్తోంది. ముందుగా ఈ కథను నానికి వినిపించాడని, ఆయన ఆసక్తి చూపించినప్పటికి ఫైనల్ వర్షన్ నచ్చక పోవడంతో సున్నితంగా తిరస్కరించారట. దాంతో ఈ కథ తో శర్వానంద్ వద్దకు వేణు వేళ్లారట. ఆయన సైతం తిరస్కరించారని తెలుస్తోంది. హనుమాన్ హీరో తేజ సజ్జా ఆసక్తి చూపించినా, ఇతర కమిట్‌మెంట్స్ వల్ల ఇప్పట్లో చేయలేను అన్నారట. దీంతో ఫైనల్‌గా నితిన్ వద్దకు చేరుకుంది. ఆయన పూర్తి కథ విన్న తర్వాత ఓకే అన్నారు, త్వరలోనే ఒప్పందాలు సైతం పూర్తి అవ్వబోతున్నాయట. ఇందులో భాగంగా తాజాగా వేణు ఈ మూవీకి సంబంధించిన అప్ డేట్ ఇచ్చారు.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 'ఎల్లమ్మ' అంటూ స్కిప్ట్ బుక్ పట్టుకుని పిక్ షేర్ చేశాడు వేణు. మొత్తానికి గట్టిగా ప్లాన్ చేశాడు. రెండో సినిమా కూడా భారీ విజయం సాధించేలా ఉంది. ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ ఈ సినిమాను తన బ్యానర్‌లో నిర్మిస్తున్నారు.




# వార్-2 గ్లింప్స్ విడుదల

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్ మూవీ 'వార్ 2'లో నటిస్తున్న విషయం తెలిసిందే. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఎన్టీఆర్ మొదటిసారి బాలీవుడ్ సినిమాలో నటించనుండటంతో ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వచ్చిన వార్ సినిమాలో హృతిక్ రోషన్, –టైగర్ ష్రాఫ్ కలిసి నటించారు. ఈ రెండో భాగంగా తారక్ హృతిక్ తలపడనున్నారు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ చాలా వరకు పూర్తయ్యిందని తెలుస్తుంది. తాజాగా ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా వార్ 2 గ్లింప్స్ ను విడుదల చేశారు. ఈ మూవీ అప్ డేట్ కోసం తారక్ ఫ్యాన్స్ ఎప్పటినుంచో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ఎన్టీఆర్ కు బర్త్ డే విషెస్ తెలుపుతూ.. అదిరిపోయే వీడియోను విడుదల చేశారు. మొత్తనికి ఆగస్ట్ 14 న ప్రేక్షకుల ముందుకు రానుంది.








## పట్టాలకెక్కిన తేజా సజ్జా మిరాయ్ మూవీ

హనుమాన్ సినిమాతో హీరోగా తేజ సజ్జా మార్కెట్ ఎలా పెరిగిందో తెలిసిందే. దెబ్బకు మూడు వందల కోట్ల క్లబ్ లో జాయిన్ అయిపోయాడు. అయితే హనుమాన్ వచ్చి ఏడాది దాటిపోయింది. కానీ ఇంకో కొత్త మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకు రాలేకపోతున్నాడు. గత ఏడాది తేజ సజ్జా 'మిరాయ్' అనే ప్రాజెక్టుని ప్రకటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ యాక్షన్–అడ్వెంచర్ లో, తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో కనిపించనున్నాడు. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రస్టింగ్ అప్ డేట్ ఒకటి బయటకు వచ్చింది. నిర్మాత ముంబైలోని చారిత్రాత్మక గుహలలో సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ను ప్రారంభించాడు. తేజ సజ్జా తో పాటు–, కొంతమంది ప్రధాన పాత్రలు కూడా ఈ షెడ్యూల్ లో పాల్గొనబోతున్నారు. ఆగస్టులో విడుదల డేట్ అనుకోగా ఆ గడువుకు చేరుకోవడానికి సినిమాకు సంబంధించిన పనులు.. షెడ్యూల్ ప్రకారం స్పీడ్ గానే జరుగుతున్నాయి. ఇక రాకింగ్ స్టార్ మనోజ్ మంచు ప్రతినాయకుడిగా, రితికా నాయక్ కథానాయికగా నటించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 8 వేర్వేరు భాషలలో 2డి మరియు 3డి ఫార్మాట్లలో గ్రాండ్ గా విడుదల అవుతుంది.

# పెరుగుతున్న భక్తులు..

- 6వ రోజుకు చేరిన సరస్వతి పుష్కరాలు
- క్షేత్ర స్థాయిలో కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణ
- అప్పటికపుడే వాకి టాకీ ద్వారా ఆదేశాలు





**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో నిర్వహిస్తున్న సరస్వతి పుష్కరాలకు భక్తులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. మంగళవారం 6వ రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుణ్య స్నానాలు చేశారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నారు. సమస్యలు ఉంటే అప్పటికపుడే వాకి టాకీ ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ వాటి పరిష్కారానికి మార్గం చూపుతున్నారు. కాళేశ్వరంలో పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్టాండ్, భక్తుల రద్దీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్ వరకు 40 షటిల్ బస్సులును ఉచితంగా నడుపుతున్నామని, వాటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరాయంగా బస్సు సర్వీసులను కొనసాగించాలని ఆదేశించారు. బాలింతల కోసం ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రయాణికులకు బస్సుల సమయ వివరాలను ఎప్పటికప్పుడు మైకు ద్వారా అనౌన్స్ చేయాలని సూచించారు. అనంతరం ఆలయంలో భక్తుల రద్దీని పరిశీలించి భక్తులు క్యూ లైన్ లో ఎక్కువ సమయం వేచి చూడకుండా త్వరగా దర్శనం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెండు క్యూ లైన్లలో భక్తులను దర్శనానికి అనుమతించాలని తద్వారా రద్దీ నియంత్రణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సరస్వతి పుష్కర ఘాట్ ను పరిశీలించి అక్కడి నుంచి హెలిప్యాడ్ జాయ్ రైడ్స్ వద్దకు చేరుకొని ప్రయాణికులతో ముచ్చటించారు. హెలిప్యాడ్ జాయ్ రైడ్స్ కు పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని ప్రధాన కూడలిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు, మంచినీరు సరఫరా, బట్టలు మార్చుకొను గదులను పరిశీలించి సౌకర్యాల కల్పనపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి కప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. సింగరేణి రెస్క్యూ సిబ్బందితో మాట్లాడి వారి సేవలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్షణ బోటు ద్వారా గోదావరిలో ప్రయాణం చేసి గోదావరి వరద ప్రవాహం భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడింగ్, సంగమంలో గజ ఈత గాళ్ళ పహారాను పరిశీలించారు. సరస్వతి ఘాట్ నుంచి గోదావరిలో త్రివేణి సంగమం, గోదావరి నది అవతలి ప్రాంతాలను ఏర్పాట్లును పరిశీలించారు. గోదావరి నీటిలో విధులు నిర్వహిస్తున్న గజ ఈతగాళ్ల సేవలను అభినందించారు. భక్తుల సౌకర్యార్థం గోదావరి నది పై భాగంలో సైతం బారికేడింగ్ చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. అనంతరం సరస్వతి ఘాట్ లో భక్తుల సూచనల మేరకు సరస్వతి ఘాట్ దిగువ తక్షణ వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ విజయ లక్ష్మీ మత్స్యశాఖ అధికారి విజయ్ కుమార్, సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

### సీఆర్పీ చేసి ప్రాణాలు నిలిపి..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో వైభవంగా సాగుతున్న సరస్వతి పుష్కరాల్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పాండు నాయక్ గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన వైద్యులు సీపీఆర్ చేసి పాండు నాయక్ ప్రాణాలను కాపాడారు. అనంతరం మహాదేవపూర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రాణాలు కాపాడినందుకు వైద్యుడు రఘురాంకు హెడ్ కానిస్టేబుల్ పాండు నాయక్, ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్ ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైద్యులు వెల్లడించారు.



# సొంత డబ్బులతో బాట

### ఆదర్శంగా దామెర రైతులు

**వరంగల్ వాయిస్, దామెర :** తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో సొంత డబ్బులతో 33 ఫీట్ల రహదారిని ఏర్పాటు చేసుకున్నామని దామెర గ్రామ రైతులు వెల్లడించారు. దీనితో కాంగ్రెస్ పార్టీ లీడర్ కు ఎలాంటి సంబంధంలేదన్నారు. ఆయనకు డబ్బులు ఇచ్చిన విషయంలో నిజం లేదన్నారు. ఈ విషయాన్ని పూర్తిగా కండిస్తున్నామన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మరాదన్నారు. కొందరు వ్యక్తుల తప్పుడు ప్రచారం చేస్తూ బాటను ఆపేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు దామెరుప్పుల సదయ్య, వేల్పుల సుధాకర్, దామెర స్వామి, దామెర సహోదరు, గాలి రామచందర్, మాదాపూర్ రమేష్, దామెర కుమారస్వామి, దామెరుపుల సాంబయ్య, దామెర కొర్నేలు, ఎడ్ల సంపత్, దామెర ప్రకాష్, దామెర రామదాసు, ఆలేటి నాగరాజు, దామెర శారద, మాదరపు చేరాలు, పుల్లూరి సురేష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.



# ఇన్ స్పెక్టర్ వెంకట రత్నం సస్పెన్షన్

**వరంగల్ వాయిస్, క్రైం :** మిల్స్ కాలనీ ఇన్స్ స్పెక్టర్ జె.వెంకట రత్నంను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఓ భూ వివాదం కేసులో బాధితులకు న్యాయం చేయకుండా, తప్పుడు కేసును నమోదు చేయడమే కాకుండా ఈ కేసులో మరణించిన వ్యక్తి పేరును కూడా నమోదు చేసి నిందితులకు సహకరించడంతోపాటు మరో కేసులో మహిళా నిందితురాలిని పోలీస్ స్టేషన్ ఆవరణలో లైంగిక వేధింపులకు గురి చేసిట్లు విచారణలో నిర్ధారణ కావడంతో వెంకటరత్నంను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.



# ఏడు రోజుల పండుగకు ఏర్పాట్లు

### కరపత్రాలు ఆవిష్కరించిన ఉత్సవ నిర్వాహకులు

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** వరంగల్ నగరంలో గల హసన్ పర్తిలో కురుమ, గొల్ల కులస్తులకు ఇలవేల్పు అయిన బీరన్న ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. నూతన బీరన్న దేవాలయ ప్రారంభ కార్యక్రమం ఈనెల 23న ప్రారంభమై 29 వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలు ఏడు రోజుల పాటు జరగనున్నాయని నిర్వాహకులు మంగళవారం ఆలయ ప్రాంగణంలో తెలిపారు. అనంతరం నిర్వాహక కమిటీ మాట్లాడుతూ గత 50 ఏళ్ల కిందట బీరన్న పెద్ద పండుగ మా పూర్వీకులు నిర్వహించారు. ఆలయ నిర్మాణం, బీరన్నపెద్ద పండుగ చేయాలని ప్రతి సంవత్సరం తొలి ఏకాదశి పండుగ రోజున అనుకునే వారు వారి ఆశ నేడు నెరవేరుతుందన్నారు. గ్రామంలో గొల్ల, కురుమ కులస్తులకు ఇలవేల్పు అయిన బీరన్న స్వామి ఆలయం లేక చాలా బాధపడేవారమన్నారు. ఇప్పుడు ఆలయ నిర్మాణానికి కులస్తులందరూ ఏకమై స్వచ్ఛందంగా విరాళాలు అందించడంతో పాటు వివిధ కులాల వారి ఆర్థిక సాయం అందిస్తూ సహకరిస్తున్నారని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపారు. ఆలయం నుంచి హసన్ పర్తి గ్రామంలో మైకులు, విద్యుత్ దీపాలు అమర్చి ఆలయం వరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాకు సంబంధించిన నిర్దేశిత లక్ష్యాన్ని బ్యాంకులు చేరుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని వివిధ బ్యాంకుల అధికారులు, వివిధ శాఖల అధికారులతో జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక లక్ష్యం రూ. 7,413 కోట్లు కాగా ఇందులో రూ.6,214 కోట్లు బ్యాంకుల వారీగా వితరణ జరగగా ఇప్పటివరకు చేరుకున్న ఆర్థిక లక్ష్యాలు, వ్యవసాయ, వ్యవసాయేతర, పరిశ్రమలు, ఆర్ సెటి, పీఎంఈజీపీ, ఆర్థిక అక్షరాస్యత, డీఆర్డీఏ, మెప్మా మహిళా స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ, బ్యాంకులవారీగా అందించిన రుణాలు, ఆర్థిక చేరిక లక్ష్యాల ప్రణాళిక, తదితర అంశాలపై బ్యాంకర్లతో సమీక్షించారు. సమీక్ష సమావేశం అనంతరం జిల్లా సంప్రదింపుల కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ దామెర మండలానికి సంబంధించి బ్యాంకును ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. వార్షిక ఋణ ప్రణాళిక ఆధారంగా బ్యాంకులు నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, నాబార్డ్ ఏజీఎం చైతన్య రవికుమార్, ఆర్.బి.ఐ. తానియా, జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, మైనారిటీ వెల్ఫేర్ అధికారి మురళీధర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఇతర అధికారులతో పాటు జిల్లాలోని వివిధ బ్యాంకులకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com